
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION


నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
శనివారం
17-05-2025
పేజీలు: 02


# నేడు కోల్‌కతా x బెంగళూరు





ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్‌లో 58వ మ్యాచ్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య జరగనుంది. బెంగళూరులోని ఎం చిన్నస్వామి క్రికెట్ స్టేడియంలో శనివారం రెండు జట్లు తలపడనున్నాయి. బెంగళూరు జట్టు ప్లేఆఫ్స్‌లో తన స్థానాన్ని పదిలం చేసుకోవడానికి ఈ పోరు చాలా ముఖ్యం.ఇటువంటి పరిస్థితిలో, రజత్ పాటిదార్ బ్రిగేడ్ విజయం నమోదు చేయడానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తుంది. ఆ జట్టు స్టార్ బ్యాట్స్‌మన్ దేవదత్ పాడిక్కల్ గాయం కారణంగా టోర్నమెంట్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో భారత బ్యాట్స్‌మన్ మయాంక్ అగర్వాల్‌ను జట్టులోకి తీసుకున్నారు. దేవదత్ పడిక్కల్ లేనప్పుడు రాయల్ ఛాలెంజర్స్ జట్టులో ఎలాంటి ప్లేయింగ్ ఎలెవన్ ఉండొచ్చో తెలుసుకుందాం? కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగే మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఇంగ్లాండ్ యువ బ్యాట్స్‌మన్ జాకబ్ బెథెల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశం ఉంది. చెన్నై సూపర్ కింగ్స్‌తో ఆడిన మ్యాచ్‌లో అతను అర్ధ సెంచరీ సాధించడం ద్వారా తనదైన ముద్ర వేయగలిగాడు. ఆ తర్వాత జాకబ్ బెథెల్‌ను మరోసారి ఓపెనింగ్ కోసం పంపే అవకాశం ఉంది.తనికి మద్దతుగా మాజీ కెప్టెన్, డాషింగ్ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లీ మైదానంలోకి వస్తాడు. 11 మ్యాచ్‌ల్లో 505 పరుగులు చేసిన ఈ ఆటగాడి బ్యాట్ ప్రస్తుత సీజన్‌లో నిప్పులు చెరుగుతోంది. రాబోయే మ్యాచ్‌లోనూ అతను తుఫాన్ బ్యాటింగ్ చేయడానికి ప్రయత్నిస్తాడు.

బ్యాట్స్‌మెన్స్, ఆల్ రౌండర్లు: మయాంక్ అగర్వాల్, రజత్ పాటిదార్ (కెప్టెన్), రొమారియో షెపర్డ్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, కృనాల్ పాండ్యా.

RCB vs KKR మ్యాచ్ కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బ్యాటింగ్ ఆర్డర్ గురించి మాట్లాడితే, అందులో కీలక మార్పు కనిపిస్తుంది. దేవదత్ పడిక్కల్ లేకపోవడంతో మయాంక్ అగర్వాల్ ప్లేయింగ్ ఎలెవన్‌లో ఉండే అవకాశం ఉంది. అతను మూడో స్థానంలో బ్యాటింగ్‌కు రావొచ్చు. కెప్టెన్ రజత్ పాటిదార్ నాల్గవ స్థానంలో బాధ్యతలు స్వీకరిస్తారు. అతను 11 మ్యాచ్‌ల్లో 10 ఇన్నింగ్స్‌లలో 239 పరుగులు చేశాడు. జితేష్ శర్మ ఐదవ స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడు. టిమ్ డేవిడ్ ఫినిషర్ పాత్రను పోషిస్తాడు. ఈ విదేశీ బ్యాట్స్‌మన్ తన దూకుడు బ్యాటింగ్‌తో జట్టుకు అనేక విజయాలను అందించాడు. చెన్నై సూపర్ కింగ్స్‌పై 14 బంతుల్లో 53 పరుగులు చేసిన రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా జట్టుకు ఆల్ రౌండర్లుగా వ్యవహరించనున్నారు.


బౌలర్లు: సుయాష్ శర్మ, యశ్ దయాల్, భువనేశ్వర్ కుమార్, లుంగి ఎన్గిడి.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB vs KKR) ఫాస్ట్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ ఐపీఎల్ 2025 మిగిలిన మ్యాచ్‌లను ఆడటంపై సందేహం ఉంది. గాయం కారణంగా, అతను ఎంపికకు అందుబాటులో ఉండటం కష్టంగా మారుతోంది. అతను లేనప్పుడు, లుంగి ఎన్గిడి ప్లేయింగ్ XIలో చేరే ఛాన్స్ ఉంది. వీరితో పాటు, రొమారియో షెపర్డ్, భువనేశ్వర్ కుమార్, యష్ దయాల్ పేస్ అటాక్‌ను నిర్వహిస్తారు. స్పిన్ బౌలింగ్ కోసం కృనాల్ పాండ్యా, సుయాష్ శర్మ ఎంపిక జట్టుకు ఉంటుంది.

## కోహ్లీ టెన్త్ మార్క్స్ షీట్ వైరల్

ఆర్సీబీ తొలి కప్పు కలను ఈసారి తప్పకుండా నిజం చేయాలని కింగ్ పట్టుదలతో ఉన్నాడు. రిటైర్‌మెంట్ ప్రకటన తర్వాత మొదటిసారి బరిలోకి దిగుతుండటంతో విరాట్ మీదే అందరి చూపు నెలకొంది. ఈ తరుణంలో ఈ టాప్ బ్యాటర్‌కు సంబంధించిన ఓ విషయం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. అదే 10వ తరగతి మార్క్స్ షీట్. మరి.. టెన్త్ క్లాస్‌లో విరాట్‌కు ఎన్ని మార్కులు వచ్చాయో ఇప్పుడు చూద్దాం.. కోహ్లీ 2004వ సంవత్సరంలో పదో తరగతిని పూర్తి చేసుకున్నాడు. అయితే బ్యాట్ పట్టి క్రీజులోకి దిగితే పరుగుల వర్షం కురిపించే విరాట్.. పరీక్షల్లో మాత్రం ఆ స్థాయిలో పెర్ఫార్మ్ చేయలేదు. ఆంగ్లం (ఏ1 గ్రేడ్), సాంఘిక శాస్త్రం (ఏ2), హిందీ (బీ1) లో అతడికి మంచి గ్రేడ్స్ వచ్చాయి. కానీ సామాన్య శాస్త్రంతో పాటు గణితంలో తక్కువ గ్రేడ్స్ వచ్చాయి. మ్యాథ్స్ (సీ2), సైన్స్ అండ్ టెక్నాలజీ (సీ1)లో తన బెస్ట్ ఇవ్వలేకపోయాడు విరాట్. ఈ 2 సబ్జెక్టుల్లో అతడికి థియరీలో 51, 32 చొప్పున మార్కులు వచ్చాయి. సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్న ఈ మార్క్‌షీట్‌పై నెటిజన్స్ స్పందిస్తున్నారు. క్రికెట్ మీద దృష్టి పెట్టడం వల్ల చదువులో అతడు రాణించలేదని అంటున్నారు. మార్కులు గొప్పగా రాకపోయినా కెరీర్‌లో అతడు ఈ స్థాయికి ఎదిగిన తీరు అందరికీ స్ఫూర్తిదాయకమని చెబుతున్నారు. క్రికెట్ కాకుండా చదువును అతడు సీరియస్‌గా తీసుకుంటే మరోలా ఉండేదని.. సక్సెస్‌కు మార్కులు కొలమానం కాదని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## కోహ్లీ టెస్ట్ జెర్సీతో అభిమానులు స్టేడియానికి...



ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అభిమానులు చాలా స్పెషల్. ప్రతి సీజన్‌లో జట్టును ఎంతగానో ప్రోత్సహిస్తుంటారు. ఈసారి ప్లే ఆఫ్స్‌కే చేరువైన ఆర్సీబీ టైటిల్ కొట్టేలా కనిపిస్తోంది. పది రోజుల బ్రేక్ తర్వాత మే 17న చిన్నస్వామి స్టేడియంలో తొలి మ్యాచ్ జరుగున్న నేపథ్యంలో బెంగళూరు ఫ్యాన్స్ విరాట్ కోహ్లీని ఆశ్చర్యపరచనున్నారు. ఈమధ్యే టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విరాట్ గౌరవార్థం అతడి జెర్సీతో సందడి చేయనున్నారు అభిమానులు. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగే మ్యాచ్ కోసం టికెట్లతో పాటు 18 నంబర్‌తో ఉన్న వైట్ జెర్సీలను భారీగా కొనుగోలు చేస్తున్నారు ఆర్సీబీ ఫ్యాన్స్. శుక్రవారం ఫ్రాంఛైజీ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ బొబాత్ ఈ విషయాన్ని ధ్రువీకరించాడు. 'టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన కోహ్లీకి సన్మానం చేయడం, అతడి జెర్సీలను పంచడం వంటివి మేము ఏమీ ప్లాన్ చేయలేదు. కానీ, కొందరు అభిమానులు మాత్రం మే 17 న కోహ్లీ టెస్టు జెర్సీతో మైదానంలోకి వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇది నిజంగా క్రేజీ.. అయితే.. ఫ్యాన్స్ సందడి మా ఆటపై ప్రభావం చూపదని నేను అనుకుంటున్నా' అని బొబత్ తెలిపాడు. ఆర్సీబీ అభిమానులు కోహ్లీపై చూపిస్తున్న ఆదరాభిమానాలకు ఈ సంఘటనే నిదర్శనం కాబోతుంది అని పలువురు అంటున్నారు. మరికొందరైతే మీ అభిమానం నిజంగానే వేరే లెవెల్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.

## 90 మీటర్లను దాటిన నీరజ్ చోప్రా



భారత జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా మరోసారి తన ప్రతిభను ప్రపంచానికి చాటాడు. దోహా డైమండ్ లీగ్ 2025లో నీరజ్ 90.23 మీటర్ల దూరంగా జావెలిన్ విసిరి తన కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశాడు. ఇది నీరజ్ చేసిన మొదటిసారి 90 మీటర్ల మార్క్‌ను దాటడం విశేషం.ఈ టోర్నీలో తొలి ప్రయత్నంలోనే 88.44 మీటర్ల త్రోతో బలంగా స్టార్ట్ చేసిన నీరజ్, రెండవ ప్రయత్నంలో ఫౌల్ అయినా, మూడవ అటెంప్ట్‌లో 90.23 మీటర్లు విసిరి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఇదివరకు అతని బెస్ట్ 89.94 మీటర్లు కాగా, అది 2022లో స్టాక్‌హోమ్ డైమండ్ లీగ్‌లో వచ్చింది.అయితే ఈసారి కూడా నీరజ్‌కు మొదటి స్థానం మాత్రం దక్కలేదు. జర్మనీలోని జులియన్ వెబర్ చివరి ప్రయత్నంలో 91.06 మీటర్లు విసిరి విజేతగా నిలిచాడు. గ్రెనెడాకు చెందిన అండర్సన్ పీటర్స్ 85.64 మీటర్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు.ఈ పోటీకి ముందు నీరజ్ చివరిసారిగా 2024 పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్నాడు. అక్కడ ఫైనల్లో 89.45 మీటర్ల త్రోతో రజతం గెలిచాడు. అర్హత రౌండ్‌లో 89.34 మీటర్లు విసిరాడు. లౌసాన్‌లో 2024లో జరిగిన టోర్నీలో 89.49 మీటర్ల వరకు వెళ్లినా, 90 మార్క్‌ను ఎప్పటికీ చేరలేకపోయాడు.ఇప్పుడు మాత్రం నీరజ్ ఈ మైలురాయిని అధిగమించాడు. 90 మీటర్ల దూరం లేదా అంతకంటే ఎక్కువ త్రో చేసిన 25వ ఆటగాడిగా చరిత్రలో నిలిచాడు. ఆసియా తరఫున ఇప్పటికే పాకిస్థాన్‌కు చెందిన అర్షద్ నదీమ్, తైవాన్‌కు చెందిన చెంగ్ చావో సన్ మాత్రమే ఈ ఘనతను సాధించారు. ఇప్పుడు వారి సరసన భారత్‌కు చెందిన నీరజ్ పేరు కూడా చేర్చుకోవడం గర్వకారణం.ప్రపంచ రికార్డు మాత్రం ఇంకా దూరంగా ఉంది. చెక్ రిపబ్లిక్‌కు చెందిన జాన్ జెలెజ్నీ పేరిట ఉన్న ఆ రికార్డు 98.48 మీటర్ల విస్తీర్ణం. కానీ నీరజ్ ప్రదర్శన మాత్రం పతాక స్థాయిలో ఉంది.



## పూజా హెగ్డే హాట్

పూజా హెగ్డే ప్రస్తుతం రెట్రో మూవీతో కోలీవుడ్‌లో ట్రెండ్ అయిన సంగతి తెలిసిందే. అయితే పూజా బ్యాడ్ లక్ కంటిన్యూ అయినట్టుగా కనిపిస్తోంది. రెట్రో మూవీ కూడా పూజా హెగ్డేకి హిట్టుని తెచ్చి పెట్టలేకపోయింది. ఈ మధ్య బుట్టబొమ్మ నటిస్తున్న సినిమాలన్నీ కూడా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొడుతూనే ఉన్నాయి. పూజా హెగ్డే హిట్టు కొట్టి చాలా ఏళ్లు అవుతున్న సంగతి తెలిసిందే.రెట్రో మూవీ ప్రమోషన్స్ మొత్తాన్ని పూజా హెగ్డే తన భుజాన వేసుకున్నట్టు అయింది. కనిమా అంటూ వదిలిన పాటలో పూజా హెగ్డే వేసిన స్టెప్పులు, ఇచ్చిన ఎక్స్ ప్రెషన్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక ఎక్కడకు వెళ్లినా, ఏ స్టేజ్ ఎక్కినా, ఏ ప్రమోషనల్ ఇంటర్వ్యూ అయినా కూడా పూజా హెగ్డే మాత్రం ఆ స్టెప్పుల్ని వేయడం ఆపలేదు. అలా రెట్రో మూవీని పూజా హెగ్డే తనకు వీలైనంతగా ప్రమోట్ చేసి జనాల్లోకి తీసుకెళ్లింది.

## అమెరికా నుంచి డబ్బు పంపితే ఇకపై 5% ట్యాక్స్!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పెంపు నిర్ణయాలతో మరోసారి చర్చనీయాంశమయ్యారు. ఈసారి ప్రవాసీయులు తమ స్వదేశాలకు పంపే నగదు బదిలీలపై 5 శాతం పన్ను విధించే ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. ఈ బిల్లు త్వరలో అమెరికా ప్రతినిధుల సభలో చర్చకు రానుంది. ఒకవేళ ఈ చట్టం అమలులోకి వస్తే, హెచ్-1బీ వీసా హోల్డర్లు, గ్రీన్ కార్డ్ దారులతో సహా అమెరికాలో నివసిస్తున్న లక్షలాది భారతీయులపై ఆర్థిక భారం పడనుంది. ఈ పన్ను వల్ల విదేశాలకు డబ్బు పంపే ప్రక్రియ ఖరీదైనదిగా మారి, ప్రవాసీయుల ఆదాయంలో గణనీయమైన భాగం పన్ను రూపంలో కోల్పోయే అవకాశం ఉంది. ఈ నిర్ణయం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా అమెరికాతో ఆర్థిక సంబంధాలు గల దేశాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఇప్పుడు కీలక చర్చాంశంగా మారింది.





## తెలంగాణలో రాబోయే నాలుగు రోజులు వర్షాలు..

తెలంగాణ రాష్ట్రంలో రాబోయే నాలుగు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. ఈ సందర్భంగా జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా, మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ విధించింది. ఈ రోజు (మే 17, 2025) కూడా రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, మరికొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఈ పరిస్థితుల్లో రైతులు తమ పొలాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. రైతులు మరియు ప్రజలు వాతావరణ మార్పులపై అప్రమత్తంగా ఉండి, సురక్షిత చర్యలు చేపట్టాలని వాతావరణ శాఖ అధికారులు కోరారు.



## వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన వైసీపీ

'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా ఈ నెల 8న జమ్మూకశ్మీర్ లో శత్రుమూకలను చెండాడుతూ వీరమరణం పొందిన అగ్నివీర్ మురళీ నాయక్ కుటుంబానికి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కొండంత అండగా నిలిచింది. ఈ నెల 13న వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మురళినాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మురళీ నాయక్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి తల్లిదండ్రులు శ్రీరాంనాయక్, జ్యోతిబాయిలను ఓదార్చారు. మురళి పోరాటాన్ని దేశం గర్విస్తోందని వైయస్ జగన్ కొనియాడారు. దేశ రక్షణలో అమరులైన వారి కుటుంబాలకు రూ.50 లక్షల ఆర్థిక సాయం చేయాలని వైయస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం మొదట ప్రతిపాదన తీసుకొచ్చింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ.. మురళీ నాయక్ కుటుంబానికి రూ.50 లక్షలు ప్రకటించగా, మురళీ నాయక్ కుటుంబానికి వైయస్ఆర్‌సీపీ తరఫున రూ.25 లక్షల ఆర్థిక సాయం చేస్తున్నట్లు వైయస్ జగన్ ప్రకటించారు. శుక్రవారం వైయస్ జగన్ ఆదేశాలతో పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ మురళి నాయక్ నివాసంలో ఆయన తల్లితండ్రులు జ్యోతిబాయ్,శ్రీరామ్ నాయక్‌కు రూ.25 లక్షల చెక్కును అందజేశారు. పార్టీ పరంగా అండగా ఉంటామని అధినేత హామీ ఇచ్చినట్లు మరోసారి ఉషశ్రీచరణ్ గుర్తు చేశారు.




## టీడీపీ నాయకులు చేసిన పాపాలని వైసీపీపై రుద్దాలని చూస్తున్నారు

రాష్ట్రంలో ఏ మంచి జరిగిన తానే చేసినట్టు, ఏ చెడు జరిగినా దానికి వైయస్ జగనే కారణమని చెప్పడం సీఎం చంద్రబాబుకు అలవాటుగా మారిందని వైసీపీ నేత జూపూడి ప్రభాకర్ అన్నారు. అయన మాట్లాడుతూ... ఇటీవల ప్రకాశం జిల్లాలో వీరయ్య చౌదరి అనే టీడీపీ నాయకుడి హత్య జరిగితే, హడావిడిగా అక్కడకు వెళ్లిన చంద్రబాబు, వాస్తవాలు తెలుసుకోకుండా గత వైయస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన పాపాలే హత్యకు కారణమంటూ మా పార్టీపై నిందలేసి చేతులు దులిపేసుకున్నాడు. తీరా చూస్తే వీరయ్య చౌదరిని సొంత పార్టీ నాయకులే హత్య చేశారని తేల్చిన పోలీసులు, నిందితులందరినీ అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఇప్పుడు టీడీపీ మరో కుట్ర చేస్తోంది. చివరి క్షణం వరకు పార్టీ కోసం పని చేసిన వీరయ్య చౌదరి కుటుంబాన్ని మోసం చేయడానికి వ్యూహ రచన చేస్తోంది. ఆ దిశలోనే, ఈ హత్య కేసుతో సంబంధం ఉన్న తమ పార్టీ నాయకులను నిర్దోషులుగా విడిచిపెట్టే కుట్ర చేస్తున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. దీన్ని కార్యకర్తలు కూడా గుర్తించడం వల్లనే వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన మంత్రి నారా లోకేష్‌ను వారు అడ్డుకున్నారని జూపూడి ప్రభాకర్‌రావు తెలిపారు.



## మరో పదేళ్లు మా ప్రభుత్వమే సీఎం స్టాలిన్ ధీమా

వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లోనే కాదు 2036లో జరుగనున్న ఎన్నికల్లో కూడా డీఎంకే గెలిచి అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. ఊటీలో ఎంపీ ఎ.రాజాతో కలిసి ఆయన వాకింగ్‌కు వెళ్ళారు. ఆ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... నీలగిరి జిల్లాల్లో ఐదురోజుల పర్యటన చాలా ఉత్సాహంగా గడించిందని, ఈ జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలను కలుసుకునే అవకాశం కూడా లభించిందన్నారు. డీఎంకే ద్రావిడ తరహా పాలనపై ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలు తనకెంతో సంతోషాన్ని కలిగిస్తోందని, ఫ్లవర్‌షోకు మంచి స్పందన వస్తోందని, తొలి రోజే వేల సంఖ్యలో పర్యాటకులు సందర్శించారని తెలిపారు. రాష్ట్ర గవర్నర్‌కు వ్యతిరేకంగా తీర్పునిచ్చిన సుప్రీం కోర్టును రాష్ట్రపతి 14 రకాల ప్రశ్నలతో వివరణ కోరిన అంశంపై త్వరలో బీజేపీ యేతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చించిన మీదట భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అన్నాడీఎంకే బీజేపీతోనే కాకుండా మరిన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకున్నా వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆ అపవిత్ర కూటమి ఘోరపరాజయాన్ని చవి చూడకతప్పదన్నారు. వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లోనే కాదు ఇక వరుసగా మరో 3సార్లు కూడా డీఎంకే పాలనే కొనసాగుతుందని స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు.

# అనగనగా మూవీ రివ్యూ




సుమంత్ హీరోగా, కాజల్ చౌదరి హీరోయిన్‌గా సన్నీ సంజయ్ తెరకెక్కించిన చిత్రం 'అనగనగా'. ఈ మూవీని థియేటర్‌లోకి తీసుకు రాకుండా నేరుగా ఓటీటీలోకి వదిలారు. థియేటర్లో విడుదల అయితే కమర్షియల్‌గా ఏ మాత్రం సక్సెస్ అయ్యేదో గానీ.. ఓటీటీలో మాత్రం ప్రశంసల్ని దక్కించుకుంటోంది. ఇంటిల్లి పాది హాయిగా చూసుకునేలా ఉందంటూ మౌత్ టాక్ వచ్చేసింది. దీంతో ఓటీటీలో ప్రస్తుతం ఈ మూవీని అందరూ చూసేందుకు ఇష్టపడుతున్నారు. మరి ఈ మూవీ రివ్యూ ఏంటో ఓ సారి చూద్దాం. వ్యాస్ (సుమంత్) పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్లాసులు చెబుతుంటాడు. ప్రస్తుతం ఉండే విద్యా వ్యవస్థకు వ్యతిరేకంగా పిల్లలకు బోధన చేయాలని పరితపిస్తుంటాడు. బట్టీ పట్టి చదివే చదువులు వ్యర్థం అని నమ్ముతుంటాడు. ర్యాంకులు మాత్రమే కావాలని అనుకునే ఇంటర్నేషనల్ స్కూల్లో పని చేస్తుంటాడు. ఆ స్కూల్‌కి చైర్మన్ రాజా రెడ్డి (అవసరాల శ్రీనివాస్). ఆ స్కూల్లోనే వ్యాస్ భార్య భాగ్యలక్ష్మి (కాజల్ చౌదరి) ప్రిన్సిపాల్‌గా పని చేస్తుంటుంది. ఇక అదే స్కూల్‌లో వ్యాస్, భాగ్యలక్ష్మి కొడుకు రామ్ (మాస్టర్ విహార్ష్) కూడా చదువుతుంటాడు. తండ్రి మాటల్ని ఫాలో అవుతూ, తండ్రి అడుగుజాడల్లోనే నడుస్తుంటాడు రామ్. ఇక ఆ స్కూల్లో కేవలం మార్కులే లక్ష్యంగా, ర్యాంకులే పరమార్థంగా పిల్లల మీద ఒత్తిడి పెంచుతూనే ఉంటారు. కానీ వ్యాస్ మాత్రం తన ధోరణిలో వెళ్తూ పిల్లలకు నచ్చినట్టుగా ఉండాలని, ఎవ్వరి మాటలు గుడ్డిగా వినొద్దని చెబుతుంటాడు. ఇక ఇలా చేయడంతో కొంత మంది పిల్లలు స్కూల్లో ఫెయిల్ అవుతారు. ప్రిన్సిపాల్ కొడుకు కూడా ఫెయిల్ అవుతాడు. దీంతో ప్రిన్సిపాల్ ఓ నిర్ణయం తీసుకుంటుంది. ఫెయిల్ అయిన పిల్లలకు ఫెయిల్యూర్ అనే బ్యాడ్జ్‌లు ఇస్తుంది. దీంతో ఆ బ్యాడ్జ్‌ని చూస్తే ఇంట్లో తన తండ్రి కొడతాడని, స్కూల్లో అంతా నవ్వుతున్నారని భయపడి బిల్డింగ్ మీద నుంచి దూకేస్తాడు. ఆ తరువాత వ్యాస్‌లో మరింత మథనం జరుగుతుంది. పిల్లల కోసం ఏదైనా చేయాలని అనుకుంటాడు. ఆ టైంలోనే ఫెయిల్ అయిన విద్యార్థులందరికీ ట్యూషన్ చెప్పడం స్టార్ట్ చేస్తాడు. పాఠ్యాంశాల్ని కథల రూపంలో చెబుతూ పిల్లల మైండ్‌లోకి ఎక్కిస్తాడు వ్యాస్. ఆ తరువాత పరీక్షల్లో అంతకు ముందు ఫెయిల్ అయిన విద్యార్థులంతా కూడా ఫస్ట్ ర్యాంక్‌ని తెచ్చుకుంటారు. అలా మొదటి సారి తన కొడుకు రామ్ కూడా ఫస్ట్ రావడంతో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి కూడా సంతోషిస్తుంది. కొడుకు రామ్ సలహాతో ఓ స్కూల్‌ను ప్రారంభించాలని వ్యాస్ అనుకుంటాడు. ఆ తరువాత ఏం జరిగింది ? వ్యాస్ తన సొంత స్కూల్‌ని ప్రారంభిస్తాడా ? ఈ నిర్ణయంతో భార్యాభర్తల మీద సమస్యలు వస్తాయా ? అసలు విద్యా వ్యవస్థలో రావాలనుకున్న మార్పుని వ్యాస్ తీసుకు వస్తాడా ? తండ్రి లేకపోతే ధైర్యంగా బతకలేని రామ్‌ను వ్యాస్ చివరకు ఎలా తీర్చి దిద్దుతాడు ? అన్నదే కథ.అనగనగా కథను చూస్తే మనకు ఆమిర్ ఖాన్ చేసిన తారే జమిన్ పర్, 3 ఇడియట్స్ గుర్తుకు రావొచ్చు. ఎందుకంటే విద్యా వ్యవస్థలోని లోపాల్ని చూపుతూ తీసిన చిత్రాల్లో అవి రెండూ ఆడియెన్స్ మైండ్‌లో రిజిస్టర్ అయి ఉంటాయి. ఇక ఈ కథ కూడా నేటి కార్పోరేట్ విద్యా వ్యవస్థను నేపథ్యంగానే తీసుకుని చేశారు. ప్రస్తుతం విద్య అనేది వ్యాపారంగానే మారిపోయింది. లక్షల్లో ఫీజులు వసూల్ చేస్తుంటారు. కానీ పిల్లల మనసుల్లోకి పాఠాల్ని ఎక్కించలేకపోతారు. అన్నీ బట్టీ పట్టి చదివించే చదువులే. కాన్సెప్ట్‌లను అర్థం చేసుకునే విధంగా కాకుండా.. మార్కుల కోసం మాత్రమే చదివిస్తుంటారు. పిల్లలు ఎంత ఒత్తిడికి గురి అవుతున్నారు.. స్కూల్లో చెప్పేది అర్థం కాక.. ఇంట్లో తల్లిదండ్రుల ఒత్తిడి కూడా తోడై పిల్లలు మానసికంగా క్షోభను అనుభవిస్తుంటారు. ఇలాంటి పాయింట్లతోనే సన్నీ సంజయ్ ఈ కథను అల్లుకున్నాడు. అనగనగా కథను చూస్తుంటే.. సన్నీ సంజయ్ తన చుట్టు పక్కల చూసిన అంశాల్నే, స్వీయ అనుభవంతో అల్లుకున్న సన్నివేశాలే అన్నట్టుగా కనిపిస్తుంది. విద్యా వ్యవస్థలో తాను కోరుకున్న మార్పుల్ని తీసుకు రావాలనే భావంతోనే ఇలా సినిమా రూపంలో సన్నీ సంజయ్ కథను చెప్పినట్టుగా అనిపిస్తుంది.కేవలం విద్యా వ్యవస్థ మీద పోరాటం అనే కాన్సెప్ట్ మాత్రమే కాకుండా ఈ మూవీకి ఫాదర్ అండ్ సన్ రిలేషన్, ఎమోషన్ టచ్ ఇచ్చాడు. అక్కడే సన్నీ సంజయ్ అందరినీ ఆకట్టుకుంటాడు. ప్రతీ ఒక్కరి గుండెని మెలిపెట్టేస్తాడు. తండ్రీ కొడుకుల బంధాన్ని అద్భుతంగా చూపించాడు దర్శకుడు. ప్రథమార్థం అంతా కూడా కార్పోరేట్ స్కూల్ పద్దతులు, పిల్లల మీద పెంచే ఒత్తిడి, ఇంట్లో కూడా తల్లి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించే సీన్లు, తండ్రీ కొడుకుల మధ్య బాండింగ్ అంటూ అలా సాగిపోతుంటుంది. ఎక్కడా కూడా ఎలాంటి ట్విస్ట్‌లు ఉండవు.


## ప్రభుత్వ నిర్ణయాలతో ఉపాధ్యాయులు ఆందోళనలో ఉన్నారు



కూటమి ప్రభుత్వ అసమర్థ విధానాలతో టీచర్లలో అలజడి సృష్టిస్తున్నారని వైయస్ఆర్‌సీపీ ఆర్‌టీఐ విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మండిపడ్డారు. తాడేపల్లి వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ విద్యార్థి, ఉపాధ్యాయుల రేషియోలో అశాస్త్రీయ విధానం కారణంగా దాదాపు 10వేల మంది స్కూల్ అసిస్టెంట్‌లను సర్‌ప్లస్‌గా చూపే పరిస్థితిని తీసుకువచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు మిగులు టీచర్లను చూపుతూ, మరోవైపు డీఎస్సీలో కొత్త టీచర్ పోస్ట్‌లను ఎలా భర్తీ చేస్తారని ప్రశ్నించారు. డీఎస్సీలో కూడా పోస్ట్‌లను తగ్గించేందుకే ఇటువంటి తప్పుడు విధానాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. గతంలో వైయస్ జగన్ ప్రభుత్వం విద్యారంగంలో తీసుకువచ్చిన సంస్కరణలను కక్షతోనే నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. ఆమె మాట్లాడుతూ.... టీచర్ల బదిలీలపై కూటమి ప్రభుత్వం కొత్త చట్టం తీసుకువచ్చింది. నలభైశాతం డిజైబులిటీ, బ్లైండ్ కేటగిరి వారిని ప్రిఫరెన్షియల్ కేటగిరిలో చూపించాలి. వారి విల్లింగ్ మేరకే బదిలీలు చేయాలి. వీటిని పరిగణలోకి తీసుకోకపోవడం వల్ల వారు కోర్టుకు వెళ్ళి స్టే తెచ్చుకున్నారు. అన్ మ్యారీడ్ లేడీస్ కూడా ప్రిఫరెన్షియల్ కేటగిరిలో ఉండేవారు, కానీ తాజాగా కూటమి ప్రభుత్వం 45 ఏళ్ళు దాటిన తరువాత 5 పాయింట్లు ఇస్తామంటున్నారు. ఇది కూడా సరికాదు. మహిళా ఉపాధ్యాయులకు ఉన్న వెసులుబాటును గౌరవించాలి. అలాగే జీఓ 342 జీఓ ప్రకారం స్టడీ లీవులో ఉన్న వారి పోస్ట్‌లను వేకెన్సీలుగా చూపించకూడదు. కానీ గతంలో ఎన్నడూ లేని విధంగా బదిలీల్లో ఆ స్థానాలను ఖాళీగా చూపుతున్నారు. కూటమి ప్రభుత్వం విద్యారంగంలో తీసుకువస్తున్న మార్పులు ఉపాధ్యాయ లోకంలో ఆందోళనలు కలిగిస్తోంది అని అన్నారు.

# త్రిప్తి డిమ్రి సమ్మర్ స్పెషల్

యానిమల్ సినిమాలో 'జోయా'గా ఇరగదీసింది త్రిప్తి డిమ్రి. నిజం చెప్పాలంటే రష్మిక మందన పాత్ర కంటే ఈ క్యారెక్టర్‌యే ఆడియన్స్‌కి ఎక్కువగా కనెక్ట్ అయింది. ఎవరెవరో అంటూ సాగే రొమాంటిక్ సాంగ్ అయితే ఫ్యాన్స్‌కి తెగ ఎక్కేసింది. ఈ సినిమా రిలీజైన తర్వాత చాలా రోజులు త్రిప్తి డిమ్రి హ్యాష్ ట్యాగ్ నేషనల్ వైడ్ ట్రెండింగ్‌లో ఉండేది. ఇక తాజాగా సమ్మర్ వెకేషన్‌కి వెళ్లింది ఈ బ్యూటీ. అక్కడ తీసుకున్న ఫొటోలని చూసి ఫ్యాన్స్ తెగ కామెంట్లు పెడుతున్నారు. మరి త్రిప్తి అందాలని మీరూ చూసేయండి.






## వర్షాకాలం సాగుపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

వానాకాలం పంట సాగుకు సన్నద్ధంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా సాగు విస్తీర్ణానికి సరిపడేన్ని విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నకిలీ విత్తనాలు, రైతులను మోసం చేసే కంపెనీలు వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి హెచ్చరించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని సీఎం అధికారులను ఆదేశించారు. కల్తీ, నకిలీ విత్తనాల దందాను అరికట్టేందుకు అన్ని జిల్లాల్లో కలెక్టర్లు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ, పోలీస్ విభాగం సంయుక్తంగా టాస్క్ ఫోర్స్ దాడులు నిర్వహించాలని, రాష్ట్ర సరిహద్దులు అన్నిచోట్ల టాస్క్‌ఫోర్స్ నిఘా ఉంచాలని చెప్పారు. రైతులను మోసం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను సీఎం హెచ్చరించారు. ఎవరెవరు కల్తీ విత్తనాలు విక్రయిస్తున్నారు, ఎక్కడ నిల్వలులున్నాయి, ఎక్కడ నుంచి రవాణా అవుతున్నాయనే వివరాలన్నీ అధికారులకు సమాచారం ఉందని, ఎవరినీ ఉపేక్షించకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు.

వర్షాకాలం సాగపై: నకిలీ దందా చేసే వ్యాపారులపై పీడీ యాక్ట్ కేసులు పెట్టాలన్నారు. విత్తనాలు, ఎరువులకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో మాట్లాడాలని సీఎస్ రామకృష్ణారావును సీఎం ఆదేశించారు. సచివాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వానాకాలం పంటల సాగుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో సరిపడే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సీజన్‌లో వరి, పత్తి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంటుందని, రైతుల నుంచి డిమాండ్ ఉన్న అన్ని కంపెనీల విత్తనాలు మార్కెట్లో ఉన్నాయని చెప్పారు. ఎరువులు, విత్తనాల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైతులకు భరోసానిచ్చారు.

నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించాలి: ఈసారి రుతుపవనాలు ముందే వస్తుండటంతో, రాష్ట్రంలోనూ వానలు ముందుగానే కురిసే అవకాశముందని వాతావరణ శాఖ చేసిన సూచనలను రైతులు గమనించాలన్నారు. అందుకు అనుకూలంగా సరైన అదనులో పంటలు వేసుకోవాలని, నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని రైతులను అప్రమత్తం చేశారు. ప్యాకెడ్ విత్తనాలు తప్ప లూజ్ విత్తనాలు కొనుగోలు చేయొద్దని, విత్తన ప్యాకెట్లు కొనేటప్పుడు తప్పకుండా బిల్లును, పాకెట్‌ను పంట కాలం ముగిసేంత వరకు భద్రపరుచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

## రూ.1300కే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమాన టికెట్

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఫ్లాష్ సేల్‌లో భాగంగా రూ.1300 నుంచి ప్రారంభమయ్యే విమాన టికెట్ల బంపర్ ఆఫర్‌ను ప్రకటించింది. ఈ ఆఫర్ కేవలం సంస్థ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా బుక్ చేసుకునే ప్రయాణికులకు మాత్రమే వర్తిస్తుంది.

ఆఫర్ వివరాలు:

ప్రయాణ వ్యవధి: జూన్ 1, 2025 నుంచి సెప్టెంబర్ 15, 2025 మధ్య.

బుకింగ్ వ్యవధి: మే 18, 2025 వరకు.